VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ డిసెంబర్ 12 గురువారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 140


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




ఈవీఎంలపై ఇండియా కూటమి ఆరోపణలు..

# అక్రమమని తెలిసీ అనుమతులా?

**అక్రమమని తెలిసీ అనుమతులిచ్చి.. ఆ తర్వాత అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేస్తే అధికారులే నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని హైకోర్టు హెచ్చరించింది.**



**నిర్మాణాలను కూల్చివేసినందుకు నష్టపరిహారాన్ని అధికారుల నుంచే రాబట్టాలి**

**వారి ఆస్తులను జప్తు చేస్తే తాతలు కనిపించాలి**

**హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు**

**హైదరాబాద్:**అక్రమమని తెలిసీ అనుమతులిచ్చి.. ఆ తర్వాత అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేస్తే అధికారులే నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని హైకోర్టు హెచ్చరించింది. అలాంటి అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రస్తుతం ఆదేశాలు జారీ చేశామని, ఇకపై అక్రమ నిర్మాణాల కూల్చివేతల వ్యవహారంలో వాటికి అనుమతులిచ్చిన అధికారుల ఆస్తుల జప్తునకు ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలోని మంగర్ని కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలను తొలగించాలంటూ ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నోటీసులను సవాలు చేస్తూ సచిన్ జైశ్వాల్, మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈ నెల 4న గోడకు నోటీసులు అతికించారని, ఏడు రోజుల్లో ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలను తొలగించాలని అందులో పేర్కొన్నారన్నారు. అనుమతులు తీసుకుని నిర్మించుకున్న రేకుల ఇళ్లను కూల్చివేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. తమ నిర్మాణాల విషయంలో జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. అధికారులు ఇచ్చిన అనుమతులతో కట్టుకున్న ఇళ్లను కూల్చివేస్తామంటే ఎలాగని ప్రశ్నించారు. బఫర్ జోన్/ఎఫ్‌టీఎల్ పరిధి ఎంతవరకో స్పష్టత ఉంటుందని.. ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీ అధికారులు జీవో 168 ప్రకారం అనుమతులను ఎందుకివ్వరని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి.. చెరువుల పరిరక్షణ చేపట్టాలని సుప్రీంకోర్టు సహా ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసిన మాట వాస్తవమేనన్నారు. అలాగని నిబంధనలను ఉల్లంఘించరాదన్నారు. అక్రమ నిర్మాణాలని తేలినప్పుడు తగిన నోటీసులు జారీ చేసి.. వివరణ తీసుకుని చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఇరిగేషన్ అధికారులు జారీ చేసిన నోటీసులపై పిటిషనర్లు 15 రోజుల్లో అన్ని ఆధారాలు, పత్రాలతో సమాధానం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.



# ఉత్తమ లెజిస్లేటర్ పురస్కారం..

**ఉత్తమ పార్లమెంటేరియన్ మాదిరే తెలంగాణ శాసనసభ, మండలిలో ఉత్తమ లెజిస్లేటర్ పురస్కారాన్ని ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు.**

2లో

**ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నాం**

**ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పునశ్చరణ తరగతుల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**

**గెలవగానే వచ్చి పక్కన చేరే వాళ్లతో జాగ్రత్త: మండలి చైర్మన్**

# వరకట్న వేధింపుల కేసుల్లో జాగ్రత్తలు పాటించాలి



**కోర్టులను సూచించిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ: వరకట్న వేధింపుల కేసుల్లో కోర్టులు అప్రమత్తంగా ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా చూడాలని చెప్పింది. భర్త తరఫు వారిని ఇరికించే ధోరణులు కనిపిస్తున్న నేపథ్యంలో చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా.. అమాయక కుటుంబ సభ్యులు అనవసర ఇబ్బందులు పడకుండా జాగ్రత్తపడాలని చెప్పింది. ఫ్యామిలీ వివాదాల కారణంగా తలెత్తే క్రిమినల్ కేసుల్లో నిర్దిష్ట ఆరోపణలు లేకుండా కుటుంబ సభ్యుల పేర్లను ప్రస్తావించడాన్ని ప్రారంభంలోనే అడ్డుకోవాలని జస్టిస్ బీవీ నాగరత్న, ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా గృహ సంబంధిత వివాదాలు తలెత్తిన సమయంలో భర్త కుటుంబ సభ్యులందరినీ ఇరికించే ప్రయత్నం తరచుగా జరుగుతుందనేది అందరికీ తెలిసిన విషయమేనని..

న్యాయపరంగా ఇది రుజువైందని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి పరిస్థితిలో చట్టాన్ని దుర్వినియోగం చేయడం ద్వారా అమాయకులు ఎవరూ చిక్కుకోకుండా కోర్టులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పింది. భర్తతో పాటు ఆయన అతడి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులపై భార్య దాఖలు చేసిన ఓ వరకట్న వేధింపుల కేసును కొట్టివేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. అయితే, ఆ ఆదేశాలను సుప్రీంకోర్టు కొట్టివేసింది.




## గ్రూప్ 2 పరీక్షలకు టీజీపీఎస్సీ సర్వం సిద్ధం

**ఈనెల 15, 16న జరగనున్న పరీక్షలు**

**హాల్‌టికెట్ల జారీలో ప్రత్యేక చర్యలు**

**జిల్లాల వారీగా హెల్ప్ లైన్ నంబర్ల కేటాయింపు**





## అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారు

**కేటీఆర్ ఆశల పల్లకిలో ఉన్నారు**

**బీఆర్ఎస్ మానసికస్థితి ఏమిటో తెలుస్తోంది**

**తెలంగాణ తల్లి విషయంలో కావాలని రాజకీయం**

**కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు విమర్శలు**





## కేటీఆర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ కౌంటర్

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కౌంటర్ ఇచ్చారు. 'నేను స్పీకర్‌ని. నాకు ఏ పార్టీతో సంబంధం లేదు. బీఆర్ఎస్ ఓడిపోయినా ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో ఉన్నారు. నేను స్పీకర్ కావడానికి బీఆర్ఎస్ కూడా మద్దతు ఇచ్చింది. సీనియర్ సభ్యుడిగా ఉన్న కేటీఆర్ స్పీకర్‌పై ఈ రకమైన వాఖ్యలు చేయడం సరైంది కాదు. బీఆర్ఎస్ ప్రజల్లో విశ్వాసం కోల్పోతోంది. శాసన సభలో ప్రతిపక్షానికి ఎన్ని అవకాశాలు ఇచ్చినా సద్వినియోగం చేసుకోవడం లేదు'అని వ్యాఖ్యానించారు.అంతకుముందు అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ తీరుపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. "శాసనసభ ప్రారంభానికి ముందే మా హక్కులకు భంగం కలిగేలా స్పీకర్ వ్యవహరించారు. మొదటి రోజే మమ్మల్ని లోపలికి రాకుండా పోలీసులతో అరెస్టు చేయించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా సమస్యలను ఎత్తిచూపేందుకు నిరసన తెలిపితే అరెస్టు చేశారు.మా పార్టీ శాసనసభ్యుల అక్రమ పార్టీ ఫిరాయింపుల పైన నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నారు. గత శాసనసభ సమావేశాల్లోనూ మా పార్టీ సభ్యుల గొంతు నొక్కేల వ్యవహరించారు. మాకు అవకాశం ఇవ్వకుండా స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించారు. మా శాసన సభ్యుల్లో అతి తక్కువ మంది మాత్రమే కొత్త శాసనసభ్యులు ఉన్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న స్పీకర్ వ్యవహార శైలికి నిరసనగా రేపటి నుంచి జరగనున్న ఓరియంటేషన్ సెషన్ను బహిష్కరిస్తున్నాము.

ఇప్పటికైనా స్పీకర్ పార్టీలకు అతీతంగా ఎలాంటి వివక్ష లేకుండా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాము" అని ట్వీట్‌లో పేర్కొన్నారు. తాజాగా, కేటీఆర్ వ్యాఖ్యలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ పై విధంగా వ్యాఖ్యానించారు.

# ప్రజలు కోరుకుంటే ఇంటెలిజెన్స్‌పై చట్టాలు తేస్తాం



న్యూఢిల్లీ: ఒకవేళ దేశ ప్రజలు కోరుకుంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై చట్టాలను రూపొందిస్తామని కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇవాళ లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అకోలాకు చెందిన బీజేపీ ఎంపీ అనుప్ ధోత్రి ఆ ప్రశ్న వేశారు. కీలక రంగాల్లో ఏఐ డెవలప్మెంట్ గురించి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెల్లడించాలని ఆయన కోరారు. ఆ ప్రశ్నకు సమాధానంగా కావాలంటే ఏఐ చట్టాలను తీసుకువస్తామని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి గురించి మాట్లాడుతూ.. టెక్నాలజ అంటే పేద ప్రజలు వాడేది కాదు అన్నట్లు కాంగ్రెస్ వ్యవహరించిందని మంత్రి పేర్కొన్నారు. నైపుణ్య శిక్షణ కోసం 8.6 లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నట్లు మంత్రి చెప్పారు. దేశవ్యాప్తంగా టెక్నాలజీని ప్రజాస్వామ్య పరచడమే ప్రధాని మోదీ ఉద్దేశమని మంత్రి వైష్ణవ్ చెప్పారు.

వేగుచుక్క

# ఉత్తమ లెజిస్లేటర్ పురస్కారం..

హైదరాబాద్: ఉత్తమ పార్లమెంటేరియన్ మాదిరే తెలంగాణ శాసనసభ, మండలిలో ఉత్తమ లెజిస్లేటర్ పురస్కారాన్ని ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజలతో మమేకమై వారి మనసులను గెలిస్తేనే నిజమైన ప్రజాప్రతినిధులు అవుతారని మండలిఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. రెండ్రోజుల పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహించే పునశ్చరణ తరగతులు బుధవారం ఇక్కడ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీహెచ్‌ఆర్డీఐ)లో ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో స్పీకర్, మండలి ఛైర్మన్ ప్రసంగించారు.



ఎమ్మెల్యేల ఓటమికి కారణం పీఏలు, పీఆర్‌వోలే...

మండలి ఛైర్మన్ గుత్తా మాట్లాడుతూ, "ప్రజా ప్రతినిధి పదవి మహోన్నతమైనది. గాలివాటం రాజకీయాలు మొదలయ్యాక ఒకసారి గెలిచాక మళ్లీ గెలవడం కష్టంగా ఉంది. మొదటిసారి ఎన్నికై మళ్లీ గెలిచే వారు 25 శాతమే. ఇప్పుడున్న 119 మంది ఎమ్మెల్యేల్లో 57 మంది నూతనంగా ఎన్నికయ్యారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు విమర్శలు రావడం సహజం. వాటికి భయపడకుండా ప్రతివిమర్శతో ముందుకెళ్లాలి. కొందరు నేతలు గెలిచాక ప్రజలకు దూరంగా ఉంటున్నారు. గెలవగానే పక్కన వచ్చి చేరే వాళ్లతో జాగ్రత్తగా ఉండాలి. ఎమ్మెల్యేలు ప్రజలకు దూరం అవడానికి, ఎన్నికల్లో ఓడిపోవడానికి ప్రధాన కారణం పీఏలు, పీఆర్‌వోలే. గన్‌మెన్‌తోనూ సమస్య ఉంది. సెక్యూరిటీ సమస్యతో నేను ఒకసారి ఓడిపోయా. ప్రజల నుంచి ఫోన్లు వస్తే వారు ఎత్తి కసురుకుంటున్నారు. వారితో జాగ్రత్తగా ఉండాలి. వచ్చే ఫోన్లను ప్రజాప్రతినిధులే ఎత్తి మాట్లాడాలి" అని సూచించారు.

శాసనసభ సమావేశాల సమయంలో సినిమాల విడుదలను వాయిదా వేసేవారు...

సభాపతి ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.."శాసనసభ్యులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా గమనిస్తుంటారు, చర్చించుకుంటారు. ప్రత్యక్ష ప్రసారం వల్ల సభ్యులు ఏం మాట్లాడుతున్నారో ప్రజలకు తెలిసిపోతుంది. గతంలో శాసనసభ సమావేశాల సమయంలో సినిమాల విడుదలను వాయిదా వేసేవారు. రోశయ్య, బోడేపూడి వెంకటేశ్వరరావు, ఓంకార్, వైఎస్ రాజశేఖరరెడ్డి, నర్రా రాఘవరెడ్డి వంటి సీనియర్ సభ్యులు గొప్ప వక్తలు. వారు సభలో మాట్లాడుతూ కొత్త సభ్యులకు స్ఫూర్తినిచ్చే వారు. సభలో మాట్లాడడానికి సమాచారం, వాగ్ధాటితో పాటు సభా వ్యవహారాలు, నిబంధనలపై అవగాహన ఉండాలి. చట్టాల రూపకల్పన, వాటి అమలు, అవి ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయో చర్చించాలి. గతంలో మాదిరిగా మొక్కుబడిగా ఒకటి రెండు రోజులు కాకుండా ప్రభుత్వం కోరిన విధంగా ఎక్కువ రోజులు సభా సమావేశాలు నిర్వహిస్తాం" అని తెలిపారు.

పునశ్చరణ తరగతులకు హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, ఉత్తమ్

గెలిచిన వారు సభకు రాకపోవడం రాజ్యాంగ విలువలను అవహేళన చేయడమే: శ్రీధర్‌బాబు

శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, "తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి కొత్త సభ్యులకు పునశ్చరణ తరగతులను నిర్వహిస్తున్నాం. పాత రోజుల్లో సిద్ధాంతపరంగా భేదాభిప్రాయాలు ఉన్నా... సభలో ఎవరి పాత్ర వారు పోషించేవారు. ఎప్పుడు మాట్లాడే అవకాశం దొరుకుతుందా అని ఎదురు చూసే వాళ్లం. ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు సభకు రాకపోవడం రాజ్యాంగ విలువలను అవహేళన చేయడమే. ప్రతి ఒక్కరు విధిగా సభకు హాజరుకావాలి. ఏటా ఉత్తమ ఎమ్మెల్యే, ఉత్తమ ఎమ్మెల్సీ పురస్కారంపై త్వరలో నిర్ణయం ఉంటుంది" అని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ "సభ ఎక్కువ రోజులు నడపాలి. 2014 నుంచి కేవలం నాలుగైదు రోజులే నడుపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం వీలైనన్ని ఎక్కువ రోజులు నడిపించాలి" అన్నారు. మండలి వైస్‌ఛైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్, భాజపాలకు చెందిన 65 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తొలిరోజు హాజరయ్యారు. దిల్లీకి చెందిన పబ్లిక్ రీసెర్చ్ స్టడీస్ సంస్థ నిపుణులు బీపీటీ ఆచారి తదితరులు... ప్రసంగాలు, ప్రశ్నోత్తరాలు, శూన్యగంట, తీర్మానాలు, వాయిదా తీర్మానాలు, ప్రత్యేక ప్రస్తావనల వినియోగం, ప్రశ్నోత్తరాలపై సభ్యులకు శిక్షణనిచ్చారు.

కేటీఆర్ వ్యాఖ్యలు తగవు: స్పీకర్

సీనియర్ శాసనసభ్యుడైన కేటీఆర్ తనపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని సభాపతి ప్రసాద్‌కుమార్ తెలిపారు. తొలిరోజు సమావేశం ముగిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను ఎవరికీ అనుకూలంగా వ్యవహరించడం లేదని, సభ్యులందరి తరపున పనిచేస్తున్నానని తెలిపారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, శాసనసభ అందరిదని, అన్ని పార్టీల వారిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించామని అన్నారు. "భారాస వారు హాజరుకాకపోవడం సరికాదు. ఇకనైనా వారు హాజరుకావాలి" అని కోరారు.

## ఈవీఎంలపై ఇండియా కూటమి ఆరోపణలు..

**న్యూఢిల్లీ:** ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమి నేపథ్యంలో ఈవీఎం మెషిన్లపై ఇండియా కూటమి నేతల ఆరోపణలు మరింత తీవ్రమయ్యాయి. అవకతవకలు, అనుమానాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని కూటమి నిర్ణయించింది. మహారాష్ట్ర రాజకీయ దిగ్గజం శరద్ పవార్, ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మధ్య మంగళవారం జరిగిన భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మహారాష్ట్రలోని హడప్సర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఎన్సీపీ–శరద్ పవార్ నేత ప్రశాంత్ జగ్తాప్ ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో మహా వికాస్ అఘాడికి అనూహ్య పరాభవం ఎదురైంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఈసారి ముందస్తు ప్రణాళిక అవసరమని భావిస్తున్నట్టు కూటమి వర్గాలు చెబుతున్నాయి. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పార్టీ గెలిచింది. అయితే, ఈసారి ఏకపక్ష విజయం సాధ్యం కాకపోవచ్చనే విశ్లేషణలు ఉన్నాయి. ఆప్ నేతలపై అవినీతి ఆరోపణలు ఉండడంతో ఈసారి విపక్ష బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అయితే, ఈవీఎం యంత్రాలను సుప్రీంకోర్టు గట్టిగా సమర్థిస్తోంది. సమర్థవంతంగానే పనిచేస్తున్నాయని చెబుతోంది. తమరు ఓడిపోతేనే సందేహాలా?, గెలిచినప్పుడు ట్యాంపరింగ్ జరగలేదా? అని విపక్ష పార్టీలను ఇటీవలి విచారణ సందర్భంగా సుప్రీంకోర్ట్ న్యాయమూర్తులు మందలించారు. మరి ఇండియా కూటమి పిటిషన్లు దాఖలైతే సుప్రీంకోర్ట్ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

## గ్రూప్ 2 పరీక్షలకు టీజీపీఎస్సీ సర్వం సిద్ధం

**హైదరాబాద్:** గ్రూప్– 2 పరీక్షలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాట్లు సిద్ధం చేసింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగే ఈ పరీక్షల కోసం సెంటర్ల వద్ద పకడ్బందీ చర్యలను చేపట్టనుంది. మరోవైపు ఇప్పటికే హాల్ టికెట్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు టీజీపీఎస్సీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అభ్యర్థుల ఇబ్బందులను నివృత్తి చేసేందుకు జిల్లాల వారీగా హెల్ప్ లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఫోన్ నెంబర్లతో కూడిన జాబితాను వెబ్ సైట్ లో విడుదల చేసింది. ఈనెల 15, 16 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 1368 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక హాల్?టికెట్లు డౌన్?లోడ్? సమయంలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు వస్తే 040–23542185 లేదా 040–23542187 నంబర్లకు సంప్రదించవచ్చు. ఈ-మెయిల్ సందేహాలు పంపవచ్చని టీజీపీఎస్సీ పేర్కొంది. గ్రూప్–2 ఎగ్జామ్ లో భాగంగా%ఌ%. మొత్తం 4 పేపర్లు ఉంటాయి. టీజీపీఎస్సీ నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం... పేపర్–1 డిసెంబరు 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 ఉంటుంది.ఇక డిసెంబరు 16వ తేదీన పేపర్?3, 4 పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రూప్–2 ప్రతి పేపరులో 150 ప్రశ్నలు 150 మార్కులకు నిర్వహించనున్నారు.

## అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారు

హైదరాబాద్: ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు వెళ్లవద్దని కేటీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారని, దీంతో బీఆర్‌ఎస్ మానసిక స్థితి ఏమిటో తెలుస్తోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు ప్రభుత్వం శిక్షణా తరగతులను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో శ్రీధర్ బాబు ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ... ప్రతిపక్షం ప్రతి దానిని రాజకీయం చేయాలని చూస్తోందన్నారు. కేటీఆర్ ఆశల పల్లకిలో ఉన్నారని, అందుకే నాలుగేళ్లలో అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఎవరూ తొలగించలేరన్నారు. ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు రావొద్దని కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందా? అని ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి విషయంలో కావాలని రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

# మోహన్ బాబు దాడిలో గాయపడ్డ జర్నలిస్టుకు సర్జరీ పూర్తి

హైదరాబాద్: టాలీవుడ్ సీనియర్ నటుడు మోహన్ బాబు చేసిన దాడిలో గాయపడిన జర్నలిస్టుకు వైద్యులు సర్జరీ చేశారు. జర్నలిస్ట్ రంజిత్‌కు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్లు సర్జరీ పూర్తి చేశారు. రెండు, మూడుచోట్ల ఫ్రాక్చర్ అయిన జైగోమాటిక్ ఎముకకు వైద్యులు సర్జరీ చేశారు. మరో మూడు, నాలుగు రోజులు ఆ జర్నలిస్టును అబ్బరేషన్‌లో ఉంచాలని వైద్యులు తెలిపారు. జర్నలిస్టుకు మెదడు, తలలో అంతర్గతంగా ఏమైనా డ్యామేజీ జరిగిందా అని ఆయన కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో ఏమైనా సమస్య తలెత్తుతుందా అని టెన్షన్ పడుతున్నారని సమాచారం. న్యూస్ కవరేజ్ కోసం జల్‌పల్లిలోని మంచు మోహన్ బాబు నివాసానికి మంగళవారం సాయంత్రం వెళ్లిన సమయంలో మీడియా ప్రతినిధి రంజిత్‌పై నటుడు ఒక్కసారిగా దాడి చేయడం కలకలం రేపింది. నమస్తే అంటూ జర్నలిస్ట్ వద్దకు వచ్చిన మోహన్ బాబు ఒక్కసారిగా రంజిత్ చేతిలో ఉన్న న్యూస్ కవర్ చేస్తున్న మైకును లాక్కున్నారు. అంతటితో ఆగకుండా తీవ్ర ఆవేశంతో




జర్నలిస్టు తలపై కొట్టడంతో అంతర్గతంగా గాయాలయ్యాయి. చికిత్స కోసం జర్నలిస్టును హాస్పిటల్ తరలించగా పరీక్షించిన డాక్టర్లు ఆయనకు జైగోమాటిక్ బోన్ ఫ్యాక్చర్ అయినట్టుగా నిర్ధారించారు. సర్జరీ సైతం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు డాక్టర్లు ఆ జర్నలిస్టుకు సర్జరీ చేసి బోన్ ఫ్రాక్చర్ సరిచేశారు. అయితే మూడు, నాలుగు రోజులు వైద్య పర్యవేక్షణలో ఉండాల్సి ఉంటుందని, కోలుకోవడానికి సమయం పడుతుందని డాక్టర్లు తెలిపారు. మీడియా ప్రతినిధిపై మోహన్ బాబు చేసిన దాడిని జర్నలిస్టు సంఘాలతో పాటు పలు సొసైటీలు, నేతలు సైతం తీవ్రంగా ఖండించారు. ప్రజల కోసం నిరంతరం వార్తలు చేరువ చేసే వారిపై దాడులకు దిగడం హేయమైన చర్య అని విమర్శిస్తున్నారు. జర్నలిస్టులకు మోహన్ బాబు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. వయసులో అంత పెద్ద వ్యక్తి, సుదీర్ఘమైన అనుభవం ఉన్న మోహన్ బాబు ఆవేశానికి లోనై జర్నలిస్టులతో దురుసుగా ప్రవర్తించి, దాడులు చేయడం సమంజసమేనా అని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు మోహన్ బాబుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై డిసెంబర్ 24 వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పోలీసులకు సూచించింది. మోహన్ బాబు దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్ పై బుధవారం విచారించిన హైకోర్టు ఈ తీర్పు వెలువరించింది. మోహన్ బాబు ప్రస్తుతం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని తెలిసిందే. నిన్న జల్‌పల్లిలోని ఆయన ఫాం హౌస్ వద్ద జరిగిన ఘటనలో ఆయనకు కంటి కింద స్వల్ప గాయం కాగా, మరోవైపు హై బీపీతో బాధపడుతున్నారని వైద్యులు తెలిపారు. రెండు రోజుల పాటు ఆస్పత్రిలో ఉండాలని, అబ్జర్వేషన్‌లో ఉంచామని వైద్యులు ప్రకటించారు

. మంచు వివాదంలో మోహన్ బాబు, మంచు విష్ణు, మనోజ్‌లకు రాచకొండ పోలీసులు నోటీసులు జారీ చేశారు. సీపీ కార్యాలయంలో హాజరైన మనోజ్ శాంతిభద్రతల సమస్య సృష్టించబోనని రూ.1 లక్ష రూపాయలకు బాండ్ ఇచ్చారు. పోలీసుల ఎదుట తాను హాజరు కావాల్సిన అవసరం లేదని మంచు విష్ణు పేర్కొన్నారు.

# ఏపీలో నూతన టూరిజం పాలసీ

**అమరావతి:** రాష్ట్రాలకు ఆదాయాన్ని తెచ్చే శాఖల్లో టూరిజం ఒకటి. సరైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే టూరిజం నుంచి అధిక ఆదాయం పొందవచ్చనేదానికి కేరళ ఒక ఉదాహరణ నిలుస్తోంది. ఆ రాష్ట్ర ఆదాయంలో టూరిజంకు ప్రత్యేక స్థానం ఉంది. అలాగే ఆంధ్రప్రదేశ్ లో సైతం టూరిజం అభివృద్ధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఆలయాలు, బీచ్ లు, టూరిస్ట్ ప్రదేశాలకు ఏపీ కేంద్రంగా ఉంది. అయితే సరైన ప్రోత్సాహం లేక పర్యాటక అభివృద్ధికి నోచుకోవడంలేదు. గత ప్రభుత్వాలు సంక్షేమంపై దృష్టి పెట్టి, టూరిజాన్ని నిర్లక్ష్యం చేశాయనేది నిపుణుల అభిప్రాయం. టూరిజాన్ని ఆదాయ మార్గంతో పాటు ఉపాధి కల్పన వనరుగా చూడాలని ప్రభుత్వాలకు సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమల, శ్రీశైలం, విశాఖ బీచ్ లు, అరకు లోయ, కోనసీమ అందాలు ఇలా ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. అయితే అవసరమైన నిధులు కేటాయించి ప్రోత్సహిస్తే... కేరళ తరహాలో ఏపీ కూడా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందనే వాస్తవం. ఆ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది. రానున్న ఐదేళ్లు (2024–29) ఏపీ టూరిజం పాలసీని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పన అంశాలే లక్ష్యంగా నూతన టూరిజం పాలసీని అమల్లోకి తెస్తున్నట్లు స్పష్టం చేసింది. ఏపీలో పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నూతన పాలసీ ఉంటుందని పేర్కొంది. ఎకో టూరిజం, క్రూయిజ్ టూరిజం, బీచ్ సర్క్యూట్‌లు, బ్యాక్ వాటర్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు నూతన పాలసీ అనువుగా ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. ఈ రంగాల్లో పెట్టుబడులను



ప్రోత్సహించేందుకు పర్యాటక పాలసీ ఉంటుందని తెలిపింది. పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పించడం, పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడం, విదేశీ టూరిస్టులను ఆకర్షించేందుకు నూతన పాలసీని రూపొందించింది. విశాఖపట్నం, అరకు వ్యాలీ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతి ప్రాంతాల్లో ఏడు యాంకర్ హబ్ లు ఏర్పాటు చేయబోతున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇటీవల తెలిపారు. అమరావతి–నాగార్జున కొండ, విశాఖపట్నం– తొట్లకొండ ప్రాంతాల్లో బుద్ధిస్ట్ సర్క్యూట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలు, శైవక్షేత్రాలు ఆలయాలను కలిపేలా 10 సర్క్యూట్ లు ఏర్పాటు చేస్తామన్నారు. కోస్టల్ టూరిజం సర్క్యూట్ లో భాగంగా విశాఖ, కాకినాడ, శ్రీకాకుళం, నెల్లూరు, మచిలీపట్నం ప్రాంతాల్లో ఐదు బీచ్ సర్క్యూట్ లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రివర్ టూరిజం సర్క్యూట్, 2 క్రూయిజ్ టూరిజం సర్క్యూట్ లను అభివృద్ధి చేస్తామన్నారు. శ్రీకాకుళం– విశాఖ, తూర్పుగోదావరి– గుంటూరు, కర్నూలు– నెల్లూరులలో ఎకో టూరిజం సర్క్యూట్ లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో టూరిజం అభివృద్ధి మరిన్ని అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. సుదీర్ఘమైన సముద్ర తీరం, పచ్చని వాతావరణం, ప్రముఖ ఆలయాలు,నదుల్లో బోటింగ్, ఇతర రాష్ట్రాలు దేశాలతో సులభమైన కనెక్టివిటీ.. ఇలా టూరిజానికి అనుకూలమైన ఎన్నో అంశాలు ఏపీలో ఉన్నాయి. వీటన్నింటికీ ప్రభుత్వ ప్రోత్సాహం, నిధుల కేటాయింపు ఉంటే ఏపీలో టూరిజం మరో అడుగు ముందుకు వేస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**విశాఖలో గూగుల్ ఆఫీస్**
**ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం**
**కలెక్టర్ల సమావేశంలో ప్రకటించిన సిఎం చంద్రబాబు**

అమరావతి, : ఆంధ్రప్రదేశ్‌కు మరో ప్రతిష్టాత్మకంగా సంస్థ రానుంది. ప్రపంచంలోనే దిగ్గజ సంస్థగా పేరున్న గూగుల్ తన కార్యకలాపాలను ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించబోతోంది. ఆ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబుతో సమావేశమై చర్చలు జరిపారు. విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు కూడా ఒప్పందం చేసుకున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నిరంతరం శ్రమిస్తుంటేనే ఫలితాలు వస్తాయని ప్రయత్నాన్ని ఆపకూడదని వారికి సూచించారు. విశాఖ కేంద్రంగా గూగుల్ కంపెనీ తన కార్యకలాపాలను ప్రారంభించబోతోందని చెప్పారు. ఇది మంత్రి లోకేష్ పట్టుదలతో సాధ్యమైందన్నారు.

# ఏపీలో బర్త్, డెత్ సర్టిఫికేట్‌లకు కొత్త వెబ్‌పోర్టల్

**జనవరి 1 నుంచి అందుబాటులోకి పోర్టల్**

అమరావతి, బర్త్ సర్టిఫికేట్, డెత్ సర్టిఫికేట్ పొందేందుకు కొత్త వెబ్ పోర్టల్ ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానుంది. ఈ పోర్టల్ జనవరి 1 నుంచి అందుబాటులోకి రానుంది. బర్త్ సర్టిఫికేట్, డెత్ సర్టిఫికేట్ పొందడంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే సరికొత్త వెబ్ పోర్టల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తుంది. కొత్త సంవత్సరంలో కొత్త వెబ్‌పోర్టల్‌లో జనన, మరణాల ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చు. 2025 జనవరి 1 నుంచి కొత్త వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఎన్. చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆర్‌టీజీఎస్ అధికారులకు ఈ మేరకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. బర్త్ సర్టిఫికేట్, డెత్ సర్టిఫికేట్ పొందడంలో ఉత్పన్నమవుతున్న ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ కొత్త వెబ్‌పోర్టల్ ఉపయోగపడాలని సూచించారు. ఈ పోర్టల్‌ను పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ సమన్వయంతో కొనసాగాలన్నారు. వాట్సాప్ ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికేట్లు ఏవైనా ఇచ్చే విధంగా వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే ప్రజలకు సేవలందాలని సీఎం చంద్రబాబు తెలిపారు. వీలైనంత త్వరగా మరో వెయ్యి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆధార్ సేవలను మరింత ప్రజలకు చేరువ చేయాలని ఆదేశించారు. దీని కోసం వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు సంబంధించి రూ.20 కోట్లు మంజూరు చేసేందుకు సీఎం చంద్రబాబు అనుమతి ఇచ్చారు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ (ఏఐ), డీప్‌టెక్ వంటి సాంకేతిక సేవలు వినియోగించుకోవాలని సూచించారు. తద్వారా ఆ వినతులను, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. డ్రోన్ల ద్వారా రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. గంజాయి తోటలను గూగుల్ మ్యాప్‌ల ద్వారా, డ్రోన్ల సాయంతో గుర్తించి, వారిని ధ్వంసం చేయాలని అన్నారు. రానున్న రోజుల్లో రైతులు పండించే పంటల తెగుళ్లను గుర్తించేందుకు కూడా డ్రోన్లు వినియోగిస్తామని అన్నారు. ఇటీవలి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ ఎలా జరిగింది? సక్రమంగా జరిగిందా? లేదా? అనేది మరోసారి అధికారులు సరి చూసుకోవాలని అధికారాలకు సీఎం చంద్రబాబు సూచించారు.

వేగుచుక్క



# "జీవనభృతి" కోసం కధం తొక్కిన బీడి కార్మికులు.




**అంక్షలు ఎత్తివేయాలని కలెక్టరేట్ వద్ద నిరసన.**

**కాంగ్రెస్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ బిఎల్ టియూ, ఏఐఎఫ్ టియు నేతల డిమాండ్.**

**జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, వేలాదిగా తరలివచ్చిన కార్మికులు.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 11:**

ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీడి కార్మికులు కధం తొక్కారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం జీవన భృతి రూ" 4016 కు పెంచాలని, 2014 కటాఫ్ డేట్ తొలగించాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బిఎల్ టియూ), శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ (ఏఐఎఫ్ టియు) నాయకత్వంలో బీడి కార్మికులు జిల్లా కేంద్రంకు తరలివచ్చి, భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు, శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు యస్. అనసూయ, రాష్ట్ర నాయకురాలు తోట వెంకట లక్ష్మి మాట్లాడారు.



రాష్ట్రములోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా, బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని గత నెల రోజులపాటు కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా తమ రెండు యూనియన్ ల ఆద్వర్యంలో కార్మికులు ఉద్యమిస్తున్న పాలకుల్లో కనీస స్పందన లేదన్నారు. ప్రజా ప్రతినిదులు కార్మికుల ఓట్లతో గద్దెనెక్కి, ప్రస్తుతం వారి సమస్యలపై నోరు మెదపక పోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలోని లక్షలాది బీడి కార్మికుల ఓట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విషయం మర్చిపోతుందని అన్నారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే సైతం అసెంబ్లీలో బీడి కార్మికుల సమస్యలను లేవనెత్తకపోవడం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి షరతులు లేకుండా బీడి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ జీవన భృతి అమలు చేయాలని, రూ" 4016 పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే దశల వారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని, ప్రజాప్రతినిధుల ఇళ్లతో పాటు ప్రజా భవన్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లోనూ కార్మికుల ఆగ్రహానికి గురి కావల్సి వస్తుందని పేర్కొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పిడి సురెందర్ లకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, శ్రామిక శక్తి తెలంగాణ బీడి వర్కర్స్ యూనియన్ నాయకులు నాగారపు యెల్లయ్య, యం, ఆంజనేయులు, కుర్తి లింగం, సయ్యద్, రవి, నాంపల్లి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఈగ సంజీవరెడ్డి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 11:**





తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. ఎన్నికలు జరిగిన తర్వాత కోర్టు ఆదేశానుసారం ఎన్నికల ఫలితాలను నిలిపివేయగా, కోర్టు ఆదేశానుసారం బుధవారం ఓట్ల లెక్కింపు జరిపారు. దీనిలో మాజీ పార్లమెంట్ సభ్యుడు జితేందర్ రెడ్డి ప్యానల్ ఘన విజయం సాధించింది. ఈ ప్యానల్లో నిజామాబాదు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఈ సి సభ్యులుగా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అంద్యాల లింగన్న కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాకు చెందిన ఇద్దరు ఏకగ్రీవంగా రాష్ట్ర ఒలంపిక్ సంఘంలో ఎంపిక కావడం పట్ల జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సంఘం మరియు జిల్లాకు చెందిన క్రీడా సంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# మోహన్ బాబును అరెస్టు చేయాలి.

## - ప్రెస్ క్లబ్ నాయకుల డిమాండ్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 11:**




జర్నలిస్టుపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబును అరెస్టు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్, జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతడ్పుల రామకృష్ణ మాట్లాడుతూ.. హైదరాబాద్ జల్ పల్లి లోని మోహన్ బాబు ఇంటి వద్ద న్యూస్ కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై మోహన్ బాబు దాడి చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. మోహన్ బాబును తక్షణమే అరెస్ట్ చేయాలని, జర్నలిస్టులకు వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి బైర శేఖర్, జర్నలిస్టులు కుంచె వెంకటేశ్, పంచరెడ్డి శ్రీకాంత్, ధనుంజయ్, మధు, ఆంజనేయులు, గోవిందరాజు, సతీశ్, రవిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏమైంది ?.

**బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు.**

**వడ్డెర సంఘం నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.**

**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్**



కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ తో పాటు ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిన ఇతర హామీలను త్వరగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. తెలంగాణ వడ్డెర సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో కలిశారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపుపై బీసీ డెడికేటెడ్ కమిషన్ కు తెలంగాణ జాగృతి సంస్థ తరఫున నివేదిక సమర్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఏడాది గడిచినా ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, ప్రతి జిల్లా కేంద్రంలో రూ. 50 కోట్లతో బీసీ ఐక్యత భవనాలను నిర్మిస్తామని ఇచ్చిన హామీల అమలు కనీస చర్య తీసుకోలేదని ఎండగట్టారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, దాన్ని అమలు చేయడంలో తాత్సారం చేయవద్దని సూచించారు. కులవృత్తుల వారికి ఈ ప్రభుత్వం కనీస మద్ధతునివ్వడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు ఏతరి మారయ్యా, అలకుంట సరస్వతి, గండికోట హరికృష్ణ,కొమరాజుల శేఖర్, గంగాధర్,ఫలపు సత్యనారాయణ, కుంచపు జగన్,శ్రీకాంత్, సాయి కుమార్, వేముల జనార్ధన్,అలకుంట కుమార్, అలకుంట మలేష్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ కస్తూర్బా పాఠశాల ఘటనపై ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ

జగిత్యాల జిల్లా సారంగాపూర్ కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారనే వార్త ఆందోళన కలిగించిందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత తెలిపారు. ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు ఆసుపత్రుల పాలవ్వడంతో, సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో వారి పిల్లల క్షేమం పట్ల భయాందోళన నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనంగా మారిందని విమర్శించారు. విద్యా శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, ఏడాది కాలంలో ఒక్కసారి కూడా సంక్షేమ పాఠశాలలకు వెళ్లి అక్కడి పరిస్థితులను, విద్యార్థుల సమస్యలను తెలుసుకోలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే సంక్షేమ పాఠశాలలను సందర్శించాలి. వాటి పరిస్థితులపై సమీక్ష చేసి ఇలాంటి పరిస్థితుల్లో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# మెగా ఫ్యామిలీ ఇలా... మంచు ఫ్యామిలీ అలా




హైదరాబాద్:ఎంటర్‌టైన్‌మెంట్ ఫీల్డ్‌లో టామ్ అండ్ జెర్రీ సిరీస్ ఎంత ఫేమస్సో ఫిల్మ్ ఇండస్ట్రీలో చిరంజీవి వర్సెస్ మోహన్ బాబు తగాదాలు అంతే ఫేమస్. పైకి మేమంతా ఫ్రెండ్స్ అని చెప్పుకుంటూనే ఉన్నా సమయం దొరికినప్పుడల్లా వారి మధ్య విభేదాలు, సెటైర్లు కంటిన్యూ అవుతూనే వస్తున్నాయి. చిరంజీవితో తనను తాను కంపేర్ చేసుకోవడం పోటీ పడడం మోహన్ బాబు చాలా కాలం నుంచి చేస్తూనే వచ్చారు. గొప్ప నటుడుగా పేరున్న మోహన్ బాబు చిరంజీవి సినిమాలుకు గట్టి పోటీ ఇచ్చారు. విలన్‌గా ప్రస్తానం ప్రారంభించి హీరోగా కలెక్షన్ కింగ్‌గా ఎదిగారు. ఈ ఇద్దరు దిగ్గజాల మధ్య జరిగిన వివాదాలతో ఆ రెండు కుటుంబాల వ్యవహారాలపై వద్దన్నా కంపేరిజన్ వస్తూనే ఉంటుంది. ఇప్పుడు ఒకేరోజు జరిగిన రెండు ఇష్యూలు మళ్లీ మెగా వర్సెస్ మంచు పోలికను తెరపైకి తెచ్చింది. 9 డిసెంబర్ 2024 మెగా ఫాన్స్ మర్చిపోలేని రోజు. మెగా బ్రదర్‌గా ఫ్యాన్స్‌కి మెగా హీరోస్‌కి మధ్యలో వారధిలా పనిచేసే నాగబాబుని ఏపీ మంత్రి వర్గంలోకి తీసుకుంటున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. జనసేన విజయం వెనకాల ఈ ఎన్నికల్లో నాగబాబు పడిన కష్టం చాలా పెద్దదే. ఆయనకు టిటిడి ఛైర్మన్ లేదా రాజ్యసభ సభ్యత్వం లభిస్తుంది అని అందరూ అంచనా వేశారు. కానీ వాటిపై ఆశ లేదంటూ ఆయన తప్పుకున్నారు. నాగబాబు పడిన శ్రమకు సరైన గౌరవం దక్కాలంటూ తమ్ముడు పవన్ కల్యాణ్ ఏకంగా మంత్రినే చేశారు. పైకి చెప్పకపోయినా నాగబాబుకి మంత్రి పదవి దక్కడంలో పవన్ పాత్రని పక్కన పెట్టలేం. నరసాపురంలో 2019లో ఓటమి చెందినా 2024లో పోటీకి సిద్ధపడ్డారు. అనకాపల్లి సీటు కోసం ప్రయత్నించారు. కానీ కూటమి కోసం తప్పుకోవాల్సి వచ్చింది. అయినా నాగబాబు ఏమాత్రం స్థైర్యం కోల్పోలేదు. పైగా తమ్ముడి వెంటే ఉన్నారు. వైపు రాజకీయంగా అన్నయ్య చిరంజీవితో సైద్ధాంతిక విభేదాలు ఉన్నా పవన్ మాత్రం ఆయన్ని తన తండ్రి లాగానే ట్రీట్ చేశారు. ఎన్నికల్లో గెలవగానే వెళ్లి ఆయన కాళ్ళ మీద పడిన దృశ్యం అభిమానులే కాకుండా తెలుగు వాళ్లందరి గుండెలను తడిమింది. రాజకీయ విభేదాలు ఉన్నా మెగా బ్రదర్స్ మాత్రం ఎప్పుడు ఒకేలా ఉన్నారు. 9 డిసెంబర్ 2024 క్రమశిక్షణకు మారు పేరుగా ఉన్న మంచు మోహన్ బాబు కుటుంబానికి ఒక చెడ్డ రోజు అనే చెప్పాలి. ఆ కుటుంబంలో రేగిన గొడవ ఏకంగా ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకునే వరకూ వెళ్ళింది. గతంలో కూడా తన ఇంటికి వచ్చి అన్నయ్య మంచు విష్ణు దాడికి దిగుతున్నారంటూ ఒక వీడియోను రిలీజ్ చేశారు మనోజ్. తర్వాత గొడవ సద్దుమణిగినా నిన్న ఏకంగా కేసులు వరకూ ఈ గొడవ వెళ్ళింది. తన ఆత్మగౌరవం కోసం పోరాడుతున్నాను తప్ప ఆస్తుల కోసం కాదంటూ మంచు మనోజ్ చెప్పారు. దుబాయ్‌లో ఉన్న మంచు విష్ణు హైదరాబాద్ చేరుకున్నారు. ఏ కుటుంబం కుటుంబంలోనైనా గొడవలు సహజమని త్వరలోనే అన్ని సర్దుకుంటాయని చెప్పారు. అన్నదమ్ముల మధ్య జరుగుతున్న గొడవను సద్దుమణిగేలా చేయడానికి పెద్దలు రంగంలో దిగారు. ఏదేమైనా మంచు ఫ్యామిలీలో జరుగుతున్న గొడవలు ఇలా రచ్చ కెక్కడం మోహన్ బాబు అభిమానుల్ని బాధిస్తోంది. అప్పుడెప్పుడో చిరంజీవికి వజ్రోత్సవాల సందర్భంగా లెజెండ్ అని బిరుదు ఇచ్చి మోహన్ బాబుకి సెలబ్రిటీ అనే టైటిల్ ఇవ్వడంతో గొడవ మొదలైంది. తాను ఎందుకు లెజెండ్ కాదంటూ మోహన్ బాబు వేదికపైనే నిర్వాహకులను ప్రశ్నించారు. దీనికి చిరంజీవి కూడా బాధపడుతూనే రిప్లై ఇచ్చారు. అప్పుడు మొదలైన మోహన్ బాబు లబ మెగాస్టార్ పోలికలు మధ్యలో కొంత కాలం సద్దుమణిగినట్టే కనిపించినా 'మా ' ఎన్నికల సందర్భంగా మళ్లీ మొదలయ్యాయి.

# అలజడి రేపుతున్న పెద్దపులులు.. చిరుత పులులు.




అదిలాబాద్:పెద్దపులులు.. చిరుత పులులు.. ఇలా పది పులులు తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో అలజడి రేపుతున్నాయి. ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఒకేసారి ఇన్నిపులులు గ్రామాల్లోకి రావడంతో అటవీ శాఖ అధికారులు కూడా వాటిని పట్టుకుని బంధించేందుకు చేసిన ప్రయత్నాలు మాత్రం ఫలించడం లేదు. కొన్ని చోట్ల పశువులు వాటికి ఆహారంగా మారుతున్నాయి. దీంతో ఇటు ప్రజలకు, అటు అటవీ శాఖ అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పుడు వచ్చిన పులులన్నీమగపులులుగా అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పులులు ఈ సీజన్ లోనే వందల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చి తమ తోడు కోసం వెతుక్కుంటాయని చెబుతున్నారు. పెద్ద పులులు, చిరుత పులులు అరణ్యాలనువదిలి జనావాసాల్లోకి వస్తున్నాయి. కుమురం భీం జిల్లాలో ఇటిక్యాలపాడులో పెద్దపులి పత్తిచేనులో ఉన్న లక్ష్మిపై పంజా విసిరింది. దీంతో లక్ష్మి మరణించింది. తర్వాత ఆ ప్రాంతంలోనే సురేష్ అనే యువకుడిపై దాడికి దిగింది. అయితే సురేష్ మాత్రం పెద్దపులి దాడికి గురై ప్రాణాపాయంనుంచి తప్పించుకున్నాడు. ఇటిక్యాలపాడులో తిరుగుతున్న పెద్దపులి ఇంతవరకూ అటవీ శాఖ అధికారులు పట్టుకోలేకపోయారు. డ్రోన్ కెమెరాలతో దాని సంచారం తెలుస్తున్నప్పటికీ దానిని బంధించేందుకు చేసిన ప్రయత్నాలు మాత్రం సఫలం కావడం లేదు. ఈ పెద్దపులి మహారాష్ట్ర నుంచి వచ్చిందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ జిల్లాలో కూడా మరో పెద్ద పులి సంచరిస్తుందని అటవీశాఖ అధికారులు గుర్తించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాత్రం హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ లోనూ పలు చోట్ల చిరుత పులి సంచారం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుంది. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలో చిరుత పులి సంచరిస్తుండగా స్థానికులు చూసి వీడియో తీసి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ చిరుత పులి ఒడిశా అటవీ ప్రాంతం నుంచి వచ్చిందని చెబుతున్నారు. అలాగే అల్లూరి జిల్లాలోనూ మరో పులి సంచరిస్తుంది. వైఎస్ఆర్ జిల్లాలో పులితో పాటు పులిపిల్ల తిరుగుతూ కనిపించిందని స్థానికులు చెబుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా పత్తిపాడు మండలంలో పశువులపై దాడి చేసింది. దానినిచిరుత పులిగా పాదముద్రలను చూసి అటవీ శాఖ అధికారులు గుర్తించారు. పశువులపై పడి వాటిని చంపేస్తున్నాయి. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలంలోనూ పులి సంచారం ఉందని తేలింది.

వేగుచుక్క

# బీరు బిర్యాని జనాలు..
# సిద్ధార్థ్ మళ్లీ టంగ్ స్లిప్..!



ఒక సినిమా ఈవెంట్ కి జనాలు వస్తే ఆ సినిమా సక్సెస్ అవుతుందా.. అదేంటి ఈవెంట్ కి జనాలు వస్తే ఎలా రిలీజ్ తర్వాత టికెట్లు తెగి కలెక్షన్స్ వస్తేనే కదా సినిమా హిట్ అయ్యేది అనుకోవచ్చు. ఐతే పుష్ప 2 ఈవెంట్ కి జనాలు వచ్చారు.. ఆ జనాల వల్ల కలెక్షన్స్ కూడా వస్తున్నాయి. ఐతే దీనిపై కోలీవుడ్ హీరో సిద్ధార్థ్ టంగ్ స్లిప్ అయ్యాడు. రీసెంట్ గా తన సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న సిద్ధార్థ్ పుష్ప 2 సినిమాకు బీహార్ లో అదే పాట్నాలో జరిగిన ఈవెంట్ కు వచ్చిన క్రౌడ్ గురించి మాట్లాడాడు. ఆ సినిమాకు ఉన్న క్రేజ్ పుష్ప 1 కి వచ్చిన బజ్ చూసి అక్కడికి జనాలు వచ్చారని చెబితే సరిపోయేది అలా కాకుండా మన దగ్గర ఏదైనా కన్ స్ట్రక్షన్ వర్క్ దగ్గర జేసీబీ సౌండ్ వినిపిస్తేనే జనం ఒకచోట గుమిగూడతారని అన్నాడు. అంతేకాదు మన దేశంలో జన సమీకరణ పెద్ద విషయం కాదని జనం వస్తేనే సక్సెస్ అంటే ప్రతి పొలిటికల్ పార్టీ మీటింగ్ లో చాలా మంది జనం వస్తారని. వాళ్లందరు గెలుస్తున్నారా అని అన్నాడు సిద్ధార్థ్. అంతేకాదు బీరు బిర్యాని వల్లే జనాలు రాజకీయ సభలకు వస్తారని మనం మాట్లాడుకుంటామని అన్నారు. మన దేశంలో జనం గుముగూడటం ఒక సాధారణ విషయమని అన్నారు. ఐతే జనం రావడం సిద్ధార్థ్ అన్నట్టుగా కామనే అయినా అవి కలెక్షన్స్ రూపంలో మారాలంటే మాత్రం అది పుష్ప 2 అయ్యుండాలని అతని మీద రివర్స్ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు. తన సినిమా ప్రమోషన్స్ లో ఏదో ఒక మాట అది కావాలని అంటాడో లేదా అలా ఫ్లోలో వచ్చేస్తుందో కానీ సిద్ధార్థ్ చేసే కామెంట్స్ ఒక్కోసారి ఆడియన్స్ కి రుచించవు.

పాన్ ఇండియా లెవెల్ లో పుష్ప 2 చేస్తున్న సంచలనాలు చూసి కూడా సిద్ధార్థ్ ఈ కామెంట్స్ చేయడం అతని అమాయకత్వాన్ని తెలియచేస్తుంది.

అంతకుముందు కూడా తన మిస్ యు సినిమాను పుష్ప 2 కి వన్ వీక్ బిఫోర్ రిలీజ్ చేయాలని ప్లాన్ చేయగా వారం తర్వాత పుష్ప 2 వస్తుంది దాని గురించి మీ స్పందన ఏంటని సిద్ధార్థ్ ని అడిగితే నా సినిమా వల్ల పుష్ప 2 భయపడాలి కానీ తనకేం లేదని అన్నాడు. తీరా చూస్తే పుష్ప 2 వైబ్ చూసి సినిమా రిలీజ్ వాయిదా వేసుకున్నారు.



## తహిలియాని అందాల గౌనులో శోభిత

గత కొంత కాలంగా ప్రేమ పక్షుల్లా తిరుగుతూ వచ్చిన నాగ చైతన్య, శోభిత దూళిపాళ వివాహ బంధంతో ఒక్కటి అయ్యారు. ఇటీవల అన్నపూర్ణ స్టూడియోలోని అక్కినేని నాగేశ్వరరావు విగ్రహం ముందు ప్రత్యేకంగా వేసిన పెళ్లి మండపం సెట్‌లో శోభిత మెడలో నాగ చైతన్య మూడు ముళ్లు వేసి ఆమెతో ఏడు అడుగులు నడిచి భార్యను చేసుకున్నాడు. నాగ చైతన్య, శోభితల వివాహానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీరి వివాహ హడావిడి గత వారం పది రోజులుగా కనిపిస్తూనే ఉంది. పెళ్లి అయిన తర్వాత పోస్ట్ వెడ్డింగ్ పార్టీ నిర్వహిస్తున్నారు. తాజాగా శోభిత తన పోస్ట్ వెడ్డింగ్ పార్టీని నిర్వహించడం జరిగింది. అక్కినేని ఫ్యామిలీ మెంబర్స్‌తో పాటు ముంబైకి చెందిన ప్రముఖ నటీనటులు, ఫ్యాషన్ డిజైనర్స్ సైతం ఈ పార్టీకి హాజరు అయ్యారని తెలుస్తోంది. స్నేహితులు, సన్నిహితులతో చాలా సంతోషంగా సాగిన ఈ పార్టీలో శోభిత తహిలియాని డిజైన్ చేసిన అందాల యూనిక్ ఔట్ ఫిట్‌లో కనిపించింది. వరుసగా పెళ్లి చీర కట్టు, ఆ తర్వాత పెళ్లి సాంప్రదాయ వస్త్రాల్లో కనిపించిన శోభిత ఇలా అందంగా కనిపించి ప్రతి ఒక్కరినీ సర్‌ప్రైజ్ చేసింది. అశ్లీలత లేకుండా చాలా అందంగా బంగారు వర్ణపు యూనిక్ గౌనులో శోభిత చాలా అందంగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. తరుణ్ తహిలియాని ప్రముఖ బాలీవుడ్ డిజైనర్ అనే విషయం తెల్సిందే. ఆయన ఎంతో మంది బాలీవుడ్ ప్రముఖ స్టార్స్‌కి డిజైనర్‌గా వ్యవహరిస్తూ ఉంటారు. అలాంటి తహిలియాని డిజైన్ చేసిన ఈ అందమైన డ్రెస్‌లో శోభిత మరింత అందంగా కనిపిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోలను తహిలియాని టీం ఇన్‌స్టా గ్రామ్ ద్వారా షేర్ చేయడంతో తెగ వైరల్ అవుతున్నాయి. నటి శోభిత బాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించి మెప్పించింది. అంతే కాకుండా వెబ్ సిరీస్‌తో తనలోని నటిని చూపించింది. తమిళ్, తెలుగులోనూ శోభిత నటిస్తూ వచ్చింది. ముందు ముందు తెలుగు సినిమాల్లో నటించే విషయమై క్లారిటీ లేదు, కానీ కచ్చితంగా హిందీ, తమిళ్ సినిమాలు, సిరీస్‌లో నటించేందుకు ఆమె ఆసక్తిగా ఉంది.

## మెగా డాటర్ గ్లామర్ ఫైర్.. షేక్ అంతే..!




ఓడిన చోట గెలవాలని బలంగా ఫిక్స్ అయిన మెగా డాటర్ నిహారిక మొదట కథానాయికగా ఒకటి రెండు ప్రయత్నాలు చేసి అది కుదరని పని అని పెళ్లి చేసుకుంది. కానీ ఆఫ్టర్ మ్యారేజ్ అది కూడా సరిగా వర్క్ అవుట్ కాకపోవడంతో డైవర్స్ తీసుకుని సోలోగా ఉంటుంది. ఐతే ఈమధ్యనే కమిటీ కుర్రాళ్లు సినిమా నిర్మించి తన ఐడియాలజీ ఎంత స్ట్రాంగ్ అన్నది మరోసారి ప్రూవ్ చేసుకుంది నిహారిక. నిర్మాతగా హిట్ అందుకున్న నిహారిక నటిగా ప్రూవ్ చేసుకోవాలని ఫిక్స్ అయ్యింది. అందుకే ఈసారి కోలీవుడ్ నుంచి ఆ ప్రయత్నం చేస్తుంది. తమిళ్ లో వాలి మోహన్ దాస్ డైరెక్షన్ లో షేన్ నిగం లీడ్ రోల్ లో వస్తున్న సినిమా మద్రాస్ కారన్. ఈ సినిమాలో ఐశ్వర్య దత్ తో పాటు నిహారిక కొణిదెల ఫిమేల్ లీడ్ గా నటిస్తుంది. సినిమా నుంచి సెప్టెంబర్ లో ఒక సాంగ్ రిలీజ్ కాగా లేటెస్ట్ గా కాదల్ సడుగుడు అంటూ రెహమాన్ రీమిక్స్ సాంగ్ రిలీజైంది. సూపర్ హిట్ సాంగ్ రీమిక్స్ ఒక లెక్క అయితే ఈ సాంగ్ లో మెగా డాటర్ నిహారిక ఇంటెన్స్ రొమాంటిక్ స్టిల్స్ నెక్స్ట్ లెవెల్ అనిపించింది. మెగా డాటర్ గా నిహారిక హీరోయిన్ అవుతానంటే ఫ్యాన్స్ కాస్త అసంతృప్తి వ్యక్తం చేశారు. అందుకే నిహారిక తెలుగులో చేసిన రెండు మూడు సినిమాలు కూడా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలనే చేస్తూ వచ్చింది. ఐతే తమిళ్ లో మాత్రం నిహారిక తన అడ్డు గోడలను తొలగించింది. అక్కడ గ్లామర్ డోస్ పెంచి మరీ నటించిందని ఈ సాంగ్ చూస్తేనే అర్థమవుతుంది. ఐతే నిహారిక చేస్తున్న ఈ బోల్డ్ అటెంప్ట్ మెగా ఫ్యాన్స్ కి రుచించకపోయినా నటిగా ఆమెకు సంతృప్తి పరుస్తుందని చెప్పొచ్చు. ఐతే నిహారిక సాంగ్ ఇలా రిలీజ్ అయ్యిందో లేదో అలా వైరల్ అయ్యింది. ఆమె హీరోయిన్ మెటీరియల్ కాదని అన్న వారికి తన సెకండ్ ఇన్నింగ్స్ తో సమాధానం చెప్పాలని గట్టిగా ఫిక్స్ అయ్యింది నిహారిక. అందుకే కాదల్ సుడుగుడు అంటూ ఈ రేంజ్ లో రెచ్చిపోయింది. సినిమా అక్కడ సక్సెస్ అయితే మాత్రం నిహారికకు కచ్చితంగా మంచి ఆఫర్లే వస్తాయి.

తెలుగు అమ్మాయిలకు తమిళ్ లో మంచి క్రేజ్ ఉంటుంది. ఐతే అందరు తమ యాక్టింగ్ తో తంబీల మనసు గెలుస్తారు. కానీ నిహారిక మాత్రం ఈసారి గ్లామర్ మంత్రంతో వారి మనసులు గెలవాలని చూస్తుంది. సాంగ్ రిలీజైన దగ్గర నుంచి సోషల్ మీడియా చెక్కర్లు కొడుతున్న ఈ మూమెంట్ చూస్తుంటే నిహారిక ఒక విధంగా సక్సెస్ అయినట్టే అని చెప్పొచ్చు.

## బుట్టబొమ్మ డబుల్ గేమ్ ఇంట్రెస్టింగ్!



టాలీవుడ్ అవకాశాల్ని కాదని బాలీవుడ్ కి వెళ్లింది పూజాహెగ్డే. కానీ అక్కడ కెరీర్ ఆశించి విధంగా సాగకపోవడంతో వెంటనే మళ్లీ సౌత్ ఇండస్ట్రీ కి కంబ్యాక్ అయింది. ఈ ప్రోసస్ లో మళ్లీ సౌత్ నుంచి అవకాశం రావడం అన్నది అంత చిన్న విషయం కాదు. కానీ పూజా మాత్రం వాటని తెలివిగా ఒడిసి పట్టుకుంటుంది. తమిళ్ తో పాటు తెలుగు సినిమాలు కొన్నింటిని చేస్తోన్న సంగతి తెలిసిందే. విజయ్, సూర్య, నాగచైతన్య లాంటి స్టార్ హీరోల చిత్రాల్లోనే నటిస్తుంది. ఇలాంటి సమయంలో ఏ నటి అయినా సౌత్ ఇండస్ట్రీపైనే మరింత శ్రద్ధ పెట్టి పనిచేస్తుంది. కొత్త అవకాశాలు ఎలా అందుకోవడంలో కొత్త స్ట్రాటజీతో ముందుకెళ్తారు. కానీ బుట్టబొమ్మ మత్రం డబుల్ గేమ్ ఆడుతుంది. ఈడ ఉంటా? ఆడా ఉంటానంటూ ఏకంగా మూడు పరిశ్రమల్లో అవకాశాలు అందుకుంటుంది. తాజాగా మళ్లీ బాలీవుడ్ చిత్రాలకు సైన్ చేస్తుంది. ప్రస్తుతం 'దేవా' అనే చిత్రం చేస్తుంది. ఈ నేపథ్యంలో మరో కొత్త ప్రాజెక్ట్ లో వరుణ్ ధావన్ కి జోడీగా నటించడానికి ఒప్పదం చేసుకుంది. ఇదొక రొమాంటిక్ కామెడీ చిత్రం. డేవిడ్ ధావన్ దీన్ని తెరకెక్కిస్తున్నాడు. మృణాల్ ఠాకూర్ కీలక పాత్ర పోషిస్తుంది. 'హై జవానీతో ఇష్క్ హైనా హై' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. త్వరలోనే సినిమా షూటింగ్ ప్రారంభించడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అంతేనే బాలీవుడ్ లో మరో యువ హీరో సినిమాకి బుట్టబొమ్మ ఒప్పందం చేసుకుం దని వార్తలొస్తున్నాయి. అంటే? అమ్మడు ఏ ఇండస్ట్రీని విడిచి పెట్టలేదు అన్న విషయం తేటతెల్లమవుతుంది. ఇంతకాలం బాలీవుడ్ లో అవకాశాలు రాక మళ్లీ కోలీవుడ్, టాలీవుడ్ చిత్రాలపై దృష్టి పెడుతుందనుకున్నారంతా.



## నానా హైరానా

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ – శంకర్ కాంబినేషన్‌లో అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందుతున్న గేమ్ ఛేంజర్ సంక్రాంతి కానుకగా జనవరిలో విడుదలవుతున్న సంగతి తెలిసిందే. రాజకీయాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో స్వార్థపరులు, అవినీతిపరులను ఎదురించే యువకుడి కథతో ఈ సినిమా రూపొందిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇందులో కియరా అద్వాణీ కథానాయికగా నటించగా, పలువురు తెలుగు, తమిళ స్టార్లు కీలక పాత్రలు పోషిచారు. ఈ సినిమా ప్రచారంలో శంకర్ టీమ్ దూకుడుగా ఉంది. ఇటీవల థమన్ సంగీతం అందించిన నానా హైరానా పాటను మేకర్స్ విడుదల చేసారు. జాతీయ అవార్డ్ గ్రహీత శ్రేయా ఘోషల్ – కార్తీక్ ఈ పాటను పాడారు. బాణీకి అద్భుతమై స్పందన వచ్చింది. లిరికల్ వీడియో ఆద్యంతం అద్భుతమైన విజువల్స్ యువతరాన్ని ఆకర్షించాయి. తాజాగా ఈ పాట చిత్రీకరణకు సంబంధించిన తెరవెనక ఫోటోలు వీడియోలను చిత్రబృందం విడుదల చేసింది. చిత్ర కథానాయకుడు రామ్ చరణ్ తన ఇన్ స్టాలో వీటిని షేర్ చేయడంతో మెగాభిమానుల్లో వైరల్ గా మారాయి. బాస్కో మార్టిస్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించారు. చరణ్– కియరా జంట రొమాన్స్ తో పాటు., ఈ పాటలో విదేశీ డ్యాన్సర్లు తమ ప్రదర్శనతో ఆకట్టుకోనున్నారు. పాట కోసం ఎంపిక చేసుకున్న లొకేషన్లు, కాస్ట్యూమ్స్, స్టైలింగ్ ఇలా ప్రతిదీ యూనిక్ నెస్ తో ఆకర్షిస్తున్నాయి. విదేశీ ముద్దుగుమ్మల నడుమ చరణ్– కియరా– శంకర్– బాస్కో తదితరులు ఉన్న అందమైన ఫోటోగ్రాఫ్ ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్జే సూర్య, అంజలి, నవీన్ చంద్ర తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. సంక్రాంతి బరిలో డాకు మహారాజ్‌సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతో గేమ్ ఛేంజర్ పోటీపడనుంది.

## పార్టీ ఉంది పుష్ప..!

పాన్ ఇండియా లెవెల్ లో పుష్ప 2 సాధించిన విజయం గురించి చేస్తున్న కలెక్షన్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. సినిమా ఈ రేంజ్ బజ్ క్రియేట్ చేస్తుందని ముందే గెస్ చేశారు కాబట్టే రిలీజ్ ముందు నేషనల్ లెవెల్ లో ఆ రేంజ్ ప్రమోషన్స్ నిర్వహించారు మేకర్స్. వారి ప్లాన్ కు తగినట్టుగానే సినిమా పాన్ ఇండియా ఆడియన్స్ కు బాగా ఎక్కేసింది. పుష్ప 2 రియల్ పాన్ ఇండియా హిట్ గా నిలుస్తూ రోజు రోజుకి భారీ కలెక్షన్ కౌంట్ తో సర్ ప్రైజ్ చేస్తుంది. ఈ ఆనందంలో పుష్ప 2 కి సంబందించిన దర్శక నిర్మాతలు, హీరో అల్లు అర్జున్, సినిమాటోగ్రాఫర్ కుబా, మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్, హీరోయిన్ శ్రీలీలతో, లిరిసిస్ట్ చంద్రబోస్ లతో స్పెషల్ ప్రైవేట్ పార్టీ చేసుకున్నట్టు తెలుస్తుంది. సినిమాలో ప్రతి ఒక్కరు తమ హండ్రెడ్ పర్సెంట్ ఇచ్చారు. పుష్ప 2 ఈ సక్సెస్ కు ఎవరి సెగ్మెంట్స్ లో వారు ది బెస్ట్ ఇచ్చారు. తెర మీద పుష్ప రాజ్ పూనకాలకు తగినట్టుగా దేవి అదిరిపోయే మ్యూజిక్ ఇచ్చాడు. సుకుమార్ టేకింగ్ కు కూబా సినిమాటోగ్రఫీ మ్యాజిక్ చేసింది. ఇక కిసిక్ సాంగ్ తో శ్రీలీల థియేటర్ అంతా దద్దరిల్లిపోయేలా చేసింది. పుష్ప 1 లో నాతోటి పోటీ పడే ఇంకోడు ఉన్నాడు అంటే అది కూడా నేనే అంటూ లిరిసిస్ట్ చంద్రబోస్ రాసినట్టుగా పుష్ప 1 రికార్డులే కాదు పుష్ప 2 దే 1 ఆల్ టైం రికార్డులను అల్లు అర్జున్ కొల్లగొడుతున్నాడు. అలాంటి లిరిక్స్ ఇచ్చిన చంద్రబోస్, ఇక ఈ సినిమా రూపొందడానికి కర్త కర్మ క్రియ అన్నీ తానై నడిపించిన సుకుమార్.. ఈ సినిమా ఇంతపెద్ద స్కేల్ లో.. ఇలా తీయడానికి అన్ని విధాలుగా సహకరించిన మైత్రి మూవీ మేకర్స్. ఇలా అందరు పుష్ప 2 ప్రైవేట్ పార్టీలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఒక పిక్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సినిమా తెర మీద అల్లు అర్జున్ పర్ఫార్మెన్స్, రష్మిక, శ్రీలీల గ్లామర్ కనిపిస్తున్నాయి. ఈ రేంజ్ అవుట్ పుట్ కోసం ఎంతో శ్రమించిన కెమెరా మెన్ కూబా, అద్భుతమైన లిరిక్స్ ఇచ్చి సినిమాను ఈ రేంజ్ లో ఆడియన్స్ కు ఎక్కేలా చేసిన లిరిసిస్ట్ చంద్రబోస్ కూడా ఈ స్పెషల్ పార్టీలో భాగం అయ్యారు. వీరితో పాటు సుకుమార్ భార్య తబిత సుకుమార్ కూడా ఈ పార్టీలో ఉన్నారు. పుష్ప 2 ప్రైవేట్ పార్టీలో దేవి శ్రీ ప్రసాద్ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచాడు. పుష్ప 2 తమిళ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో నిర్మాతలపై దేవి అసంతృప్తి మాటలు తెలిసిందే. ఐతే ఆ కామెంట్స్ వారి మధ్య గ్యాప్ పెంచుతుందని అనుకున్నారు. కానీ ఈ పార్టీతో వాటికి చెక్ పెట్టినట్టే లెక్క. లెక్కల మాస్టర్ సుకుమార్ ఒక సినిమాను పర్ఫెక్ట్ కాలిక్యులేషన్స్ తో తీస్తే రిజల్ట్ ఎలా ఉంటుందో పర్ఫెక్ట్ గా చెప్పేలా పుష్ప 2 సినిమా ఫలితం.. అంది దక్కించుకుంటున్న కలెక్షన్స్ చూసి చెప్పొచ్చు.

